క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

రాజాపేట : మండలంలోని పాముకుంట గ్రామంలో నేడు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గ్రామాభివృద్ధి సంస్థ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హస్గరే- ఆకృతి కమ్యూనిటీ ఔట్ రీచ్ ప్రోగ్రామ్ క్వాల్కం కంపెనీ సహకారంతో ఉన్నత పాఠశాలలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు.

చౌటుప్పల్ సీఐగా మన్మథకుమార్


మన్మథకుమార్

చౌటుప్పల్ : పట్టణ నూతన సీఐగా జి.మన్మథకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌రెడ్డిని రాచకొండ సైబర్ క్రైమ్ సీఐగా బదిలీ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఉప్పల్‌లో డిటెక్టివ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న మన్మథకుమార్ పట్టణ సీఐగా వచ్చారు.

ఆలేరు ఎస్‌ఐగా రజనీకర్


కె.రజనీకర్, ఎస్‌ఐ

ఆలేరురూరల్ : మండల నూతన ఎస్‌ఐగా కె.రజనీకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వెంకటశ్రీను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ రాచకొండ హైదరాబాద్‌కు అటాచ్ చేశారు. రజనీకర్ రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నుంచి బదిలీపై ఆలేరుకు వచ్చారు.

బొమ్మలరామారం ఎస్‌ఐగా శ్రీశైలం

బొమ్మలరామారం : మండల నూతన ఎస్‌ఐగా బి.శ్రీశైలం గురువారం బాధ్యతలు చేపట్టారు. రాచకొండ కమిషనరేట్ సీపీఓలో వెయిటింగ్‌లో ఉన్న శ్రీశైలం మండల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టినట్లు రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్


ఆలేటి అనిల్

ఆలేరురూరల్ : పట్టణానికి చెందిన ఆలేటి అనిల్ ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగాం ఉపేందర్‌రెడ్డిలు గురువారం పట్టణ కేంద్రంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హైమావతి

గుండాల : మండలంలోని పాచిల్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హైమావతి గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలలో ఐరన్, జింక్ సిరప్, ఆల్బెండాజోల్ మాత్రలను అందజేశారు. విద్యార్థులను బరువు తీసి తక్కువ బరువు ఉన్న పిల్లలకు మాత్రలు అందజేశారు. ప్రతి 15రోజులకు ఒకసారి బిడ్డల బరువును తీయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ జ్యోత్స్న, సూపర్‌వైజర్ షమీమ్‌బేగం, యాకుబ్‌పాషా, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

బస్ సర్వీసు ప్రారంభం


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి ఉప్పల్ డిపో నుంచి సికింద్రాబాద్ మీదుగా ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బస్సు గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు గురువారం ప్రారంభించారు. ఈ బస్సు రోజు మూడు విడతలుగా గ్రామం నుంచి వెళ్తుందని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. బస్సు సర్వీసు ఏర్పాటు చేసిన ఉప్పల్ డిపో మేనేజర్ హరికీర్తి శ్రీనివాస్‌శర్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నం పాండు, కంకల కిష్టయ్య, బొక్క కొండల్‌రెడ్డి, వల్లందాస్ ఆదినారాయణ, మాయ బాల్‌నర్సయ్య, పిట్టల వెంకటేశం, చిన్నం వెంకటేష్, నోముల కృష్ణారెడ్డి, శ్రీశైలం, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు వినతి

ఆలేరురూరల్ : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మండలంలోని కొలనుపాక జైనమందిరానికి వచ్చిన సందర్భంగా గురువారం ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవీవెంకటేష్, పత్తి వెంకటేష్, కటకం బాలరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష అత్యంత మధురమైనది


రామన్నపేట : గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రామన్నపేట : ప్రపంచంలో తెలుగు భాష అత్యంత మధురమైనదని సహజ కవి, తెలుగు భాషా శతక కర్త మెరుగు మల్లేశం అన్నారు. గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ తెలుగు భాషలో ప్రావీణ్యతను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, అధ్యాపకులు డాక్టర్ జేసీబాబు, డాక్టర్ లక్ష్మీనీలిమ, డాక్టర్ సీహెచ్ వెంకట్‌గౌడ్, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ జి.సునీత, ఎం.అనిత, డాక్టర్ ఎం.రవీందర్, డాక్టర్ ఆర్.శ్రీనివాసులు, బ్రహ్మం, బసవయ్య పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

రాజాపేట : మండలంలోని రఘునాథపురం, బొందుగుల గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మనోజ్, ప్రభాకర్, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, అపర్ణాదేవి, శ్రీనివాసాచారి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీహరి, జయప్రద, సునీత, సమ్మిరెడ్డి, స్వప్న, కృష్ణమూర్తి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తెలుగు భాషను బోధించి రిటైర్డ్ అయిన గెజిటెడ్ హెచ్‌ఎంలు యాదగిరిలక్ష్మి, తొగిటి మనోహరాచారి, వారాల యాదగిరి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రామ్‌రెడ్డి, ఇటీవల బదిలీపై వెళ్లిన పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గుమ్మడెల్లి వెంకన్నను పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, సరస్వతీదేవి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.అరవిందరాయుడు, యాదగిరిలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణ, ప్రవీణ్, వెంకటాచారి, జక్కుల రవి, సుధీర్‌కుమార్, మంజుల, స్వప్న, ఉప్పలయ్య, శ్రావ్య, రేవతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌గ్రోవ్ స్కూల్‌లో..

చౌటుప్పల్ : పట్టణంలోని గ్రీన్‌గ్రోవ్ హైస్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వ్యవహారిక తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణఅనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజాపేట : రఘునాథపురంలో ధ్యాన్‌చంద్, సరస్వతి చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు


మోత్కూరు : జెడ్పీ పాఠశాలలో సరస్వతి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లను ఆయన అందజేసి మాట్లాడారు. దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించాలని, ప్రభుత్వం చేయూత ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అంతకు ముందు మండలంలోని గోవింద్‌తండాకు చెందిన యువకుడు రాజేష్ ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్‌ల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపల్లి కాల్వలోని మోటార్లను తొలగించొద్దు


ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వలిగొండ : ధర్మారెడ్డిపల్లి కాల్వలో సాగునీటి కోసం రైతులు వేసిన మోటార్లను తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. ఈ సందర్భంగా గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, ప్రొద్దటూరు, ఏదుళ్లగూడెంలో ధర్మారెడ్డిపల్లి, పిలాయపల్లి కాల్వలలో రైతులు వేసిన మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండే కిష్టయ్య, కవిడే సురేష్, గూడూరు చిన్న బుచ్చిరెడ్డి, తూర్పునూరి శంకరయ్య, మంగ బాలయ్య, గుండు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని చౌటుప్పల్ మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారంమండలంలోని చిన్నకొండూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో గ్రామాల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికి యువకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పబ్బు రాజుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ వైస్‌ఎంపీపీ భద్రయ్య, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్, చంద్రయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


భువనగిరి : బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి : ప్రతిభ కలిగిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని, ప్రతిఒక్కరూ రోజు వారికి జీవితంలో ఆటలను భాగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉద్యోగులు వృత్తి రీత్యా ఉద్యోగ విధులతో పాటు క్రీడలు సైతం ఆడాలన్నారు. అనంతరం జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కె.ధనుంజనేయులు మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి, యూత్ అసోసియేషన్ కార్యదర్శి కరుణ్, పీఈటీలు, పీడీలు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

యాదగిరిగుట్ట రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో కూడా రాణించాలని హెచ్‌ఎం డాక్టర్ ఎం.మల్లిఖార్జున్ అన్నారు. మండలంలోని మాసాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని చేపట్టారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, అనంతరం బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

బీబీనగర్ : మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం క్రీడల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రీడల పోస్టర్ ప్రజంటేషన్, ఏరోబిక్ డ్యాన్స్, రిథమిక్ యోగా, తదితర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిరూప, వైస్ ప్రిన్సిపాల్ రూప, ఫిజికల్ డైరెక్టర్ స్వప్నరాజ్ తదితరులు పాల్గొన్నారు.


యాదగిరిగుట్ట రూరల్ : క్రీడా దినోత్సవంలో పాల్గొన్న హెచ్‌ఎం మల్లిఖార్జున్ తదితరులు


బీబీనగర్ : క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఆర్మీ కళాశాల విద్యార్థులు

షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలి


చౌటుప్పల్ : ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చౌటుప్పల్ : షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, పెంటయ్య, రాజయ్య, గంగదేవి సైదులు, చీరిక సంజీవరెడ్డి, స్వామి, యాదిరెడ్డి, వెంకటేశం, పల్లె మధుకృష్ణ, రాగీరు కిష్టయ్య, ఆనంద్, శివ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. భూమి పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు, దడిపల్లి ప్రభాకర్, పసునూరి చంద్రారెడ్డి, కురుమేటి యాదయ్య, అంజయ్య,నర్సింహ, చంద్రయ్య, సైదులు, చంద్రయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

గుండాల : ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 567 జీఓను సవరించాలని, తెల్ల రేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నీలిమకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మద్దెపురం రాజు, సత్యనారాయణ, అంజయ్య, ఖలీల్, బాలయ్య, లింగయ్య పాల్గొన్నారు.

దివీస్ సేవలు అభినందనీయం

వలిగొండ : దివీస్ ల్యాబరేటరీ వారు ఈ ప్రాంత ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం మజీద్ అన్నారు. గురువారం మండలంలోని గోకారం, జాలుకాల్వ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 134మందికి సుమారుగా రూ.3,31,446విలువ గల స్కూల్ బ్యాగులు, నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిల్స్, షూ పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తిరుపతమ్మ, సందీప్, సురేందర్, కృష్ణవేణి, సాయికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి బీఆర్‌ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి సౌజన్యంతో గురువారం బియ్యం అందజేశారు. రామచంద్రారెడ్డి తనయుడు శ్రీపతిరెడ్డి 21వ జయంతి సందర్భంగా 6క్వింటాల బియ్యాన్ని కళాశాలకు విరాళంగా అందజేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, మల్లేష్, భానుప్రకాష్, శ్రీకాంత్, ఉపేందర్, ప్రవీణ్‌గౌడ్, అధ్యాపకులు ఉన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ


గుండాల : వెల్మజాలలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న మండల నోడల్ అధికారి


యాదగిరిగుట్ట రూరల్ : రైతుల వద్ద సెల్ఫీ దిగి యాప్‌లో నమోదు చేస్తున్న ఏడీఏ, ఏఓ

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని బాహుపేట గ్రామంలో రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ఏడీఏ శాంతినిర్మల, మండల వ్యవసాయాధికారిణి సుధారాణి గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో రేషన్‌కార్డు లేక రుణమాఫీ ఆగిపోయిన రైతుల ఇంటి వద్దకు వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేశారు. అదేవిధంగా కుటుంబ సభ్యులతో సెల్ఫీదిగి, ధ్రువీకరణ పత్రాలను తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సర్వే

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం రూ.2లక్షల రుణమాఫీ కాని రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని వారి కుటుంబ సభ్యుల వివరాలను, ఆధార్‌కార్డు, బ్యాంక్ అప్పు వివరాలను, రేషన్‌కార్డు వివరాలను రైతుల నుంచి సేకరించి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఓ అరుణకుమారి, ఏఈఓలు సరిత, క్రాంతి, మనీష, సౌమ్య, శ్రీకర్, గ్రామస్తులు ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్ : రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదుకు గురువారం మండలంలో వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. మండలంలోని దండు మల్కాపురంలోని రైతు వేదికలో రైతుల కుటుంబ వివరాలను సేకరించారు. రుణమాఫీకి అర్హత ఉండి రేషన్‌కార్డు లేని వారికి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈఓ పాల్గొన్నారు.

గుండాల : ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీలో రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సుజాత, ఏఈఓలు క్రాంతి, శ్వేత, భార్గవి ఉన్నారు.

ఇంద్రపాలనగరంలో రైతుల వివరాల సేకరణ

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో రుణమాఫీ రాని రైతుల కుటుంబ సభ్యుల సర్వేను గురువారం నిర్వహించారు. రేషన్ కార్డు లేని కుటుంబ సభ్యుల వివరాలు ఆధార్‌నంబర్లు, సెల్ఫీఫొటోలను రుణమాఫీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్, విస్తరణాధికారులు ఎం.వెంకన్న, ఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, ఎం.కిరణ్, మాజీఎంపీపీ పూస బాలమణి, మాజీసర్పంచ్ పూస బాలనర్సయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు : రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ కాకపోవడంతో గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కుటుంబ నిర్ధారణ కోసం వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించారు. రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని 40మంది రైతు కుటుంబాల వివరాలను సేకరించి వ్యవసాయ అధికారులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి, ఏఈఓలు దయాకర్, నవనీత పాల్గొన్నారు.

రుణమాఫీ రాని రైతుల కుటుంబాల నిర్ధారణ

వలిగొండ : మండలంలోని ఆయా గ్రామాల్లో రుణమాఫీ లబ్ధిపొందని రైతులకు కుటుంబ నిర్ధారణ సర్వే గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా రైతుల సెల్ఫీఫొటోతో వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి తెలిపారు. మొదటి రోజు80మంది రైతుల వివరాలను అప్‌లోడ్ చేశామని తెలిపారు.

కనులపండువగా ముత్యాలమ్మ బోనాలు


రామన్నపేట : నీర్నెములలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రామన్నపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం గ్రామదేవతల బోనాల వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాలను మహిళలు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో ఊరబోనాల (ముత్యాలమ్మతల్లి) వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతఊరు మార్కండేయస్వామి దేవాలయం వద్ద, తంగడపల్లి రోడ్డులోని శ్రీముత్యాలమ్మతల్లి దేవాలయాలను అందంగా ముస్తాబుచేశారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు-సంధ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను పురస్కరించుకొని మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.


చౌటుప్పల్‌లోని బొడ్రాయి వద్ద బోనాలతో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఈదమ్మ, బీరప్ప, ముత్యాలమ్మ బోనాల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి, కులదేవతలకు, ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : పట్టణంలోని సుందరయ్య కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన తాటి అరుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి మన మోత్కూరు స్వచ్ఛంద సేవా సంస్థ వాట్సాప్ గ్రూపు దాతలు పిల్లల చదువులకు రూ.20,500 చెక్కును మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, బద్దం నాగార్జున్‌రెడ్డి చేతుల మీదుగా మృతురాలి తల్లికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకట్, మర్రి అనిల్, అవిశెట్టి స్వామి, మొరిగాల శ్రీనివాస్, ఎండీ.సమీర్, కోమటి జనార్దన్, శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

చౌటుప్పల్ : వక్ఫ్ సవరణ బిల్లును అన్నివర్గాల ప్రజలు వ్యతిరేకించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జహంగీర్ కోరారు. పట్టణ కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి షాదీఖానా భవనంలో గురువారం జరిగిన వక్ఫ్ ల్యాండ్స్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ అధికారాలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం నూతనంగా చట్ట సవరణ బిల్లు తీసుకువస్తుందన్నారు. సమావేశంలో ఎండీ.పాష, ఎండీ.గౌస్, లతీఫ్, రఫీ, ఖలీల్, సర్వర్, బడేసాబ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి చేయూత

భువనగిరి రూరల్ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు శ్యామ్‌గౌడ్ తాటిచెట్టు పైనుంచి పడి ఇటీవల మృతి చెందాడు. గురువారం కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో అతడి కుటుంబానికి రూ.30వేల ఆర్థికసాయంతో పాటు బట్టల దుకాణం ఏర్పాటు చేయించారు.

6గుంటల భూమి నమోదుకు ఆరేళ్లుగా పడిగాపులు


పాత, కొత్త పాస్‌పుస్తకాలతో రైతు ఎండీ షాబుద్దీన్

ఆత్మకూరు(ఎం) : నూతన పాస్‌పుస్తకం జారీలో తప్పిపోయిన ఆరు గుంటల భూమి నమోదుకు ఓ రైతు ఆరేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు పడుతున్నాడు. అయినా ఇప్పటికీ ఆ భూమి పాస్‌పుస్తకంలో నమోదు కాని పరిస్థితి. ఈ సంఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వెలుగులోకి వచ్చింది. మోత్కూరు మండల కేంద్రానికి చెందిన ఎండీ షాబుద్దీన్‌కు ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెల్ల క్లస్టర్ పరిధిలో 3.06ఎకరాల భూమి ఉంది. పాత పట్టాదారు పాస్‌పుస్తకంలో కూడా 3.06ఎకరాలుగా నమోదు చేయబడి ఉంది. అయితే ధరణి వచ్చిన తర్వాత కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయడంతో అట్టి సర్వే నంబర్‌లో 3.06ఎకరాలకు బదులుగా 3ఎకరాలు అని నమోదు చేయబడి ఉంది. పాస్‌పుస్తకంలో 6గుంటల భూమి తప్పిపోవడంతో రైతు షాబుద్దీన్ అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాడు. న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో కూడా వినతిపత్రం అందజేశారు. పలుమార్లు చలాన్లు కూడా చెల్లించాడు. అయినా ఇప్పటి వరకు భూమి మాత్రం నమోదు కాలేదు. పైగా భూమి నమోదు కోసం ఆరేళ్ల కాలంలో రూ.50వేల వరకు ఖర్చు చేసినట్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, కలెక్టరేట్‌లో రైతు అందజేసిన దరఖాస్తు ఏ స్టేటస్‌లో ఉందో తెలుసుకుని 6గుంటల భూమిని నమోదు చేస్తామని వెల్లడించారు.